సాక్షి
ములుగు

శుక్రవారం | 2 | మే | 2025



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు అందజేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. - 8లో▸



కోర్టు ఆదేశాలు బేఖాతర్

సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పు ఇచ్చినా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం 37.4^{0} /27.5^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటాయి. రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలకు సెలవులు ప్రకటించడం హర్షణీయం

ములుగు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించడం హర్షణీయమని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మీ అన్నారు. ఈ మేరకు గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సీతక్కను శాలువాలతో సన్మానించి, కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించడం ఐసీడీఎస్ చరిత్రలో మొదటి సారి అని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని నెరవేర్చారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరించాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లకు పెంచిన వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సునీత, మంగ, శశికళ, రాజేందర్, సమ్మక్క, పద్మారాణి, భాగ్యలక్ష్మి, సరిత, రుక్మిణి, జమున, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల ఫలాలు అందరికీ అందాలి



భూపాలపల్లి అర్బన్: కార్మిక చట్టాల ఫలాలు అందరికీ సమానంగా అందినప్పుడే మేడే లక్ష్యం నెరవేరినట్లని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాజు తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్, కాకతీయ హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన మేడే ఉత్సవాల్లో జడ్జి పాల్గొని మాట్లాడారు. కార్మికుల ఆరోగ్యం, భద్రత పెన్షన్ చాలా ముఖ్యమైనవన్నారు. ఈ ఫలాలు అందరికీ అందాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌రావు, న్యాయవాదులు ప్రియాంక, కార్మిక సంఘాల నాయకులు సాయిలు, రమేష్, మహేందర్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన అర్చకుడి ఉద్యోగ విరమణ



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన దేవస్థానంలో పలు హోదాల్లో అర్చక వృత్తిలో కొనసాగారు. గురువారం ఉద్యోగ విరమణ పొందిన దంపతులను ఈఓ శనిగెల మహేష్, అర్చక బృందం,సిబ్బంది, పలువురు నాయకులు సన్మానించారు.

సద్వినియోగం చేసుకోవాలి



మొగుళ్లపల్లి: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు అన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో గురువారం కబడ్డీ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల శాఖ అధికారి రఘు మాట్లాడుతూ విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మెళకువలు నేర్చుకోవాలని కోరారు. ఈ శిక్షణ శిబిరాలు జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కోచ్ మహేశ్, కేల్ ఇండియా కోచ్ శ్రీనివాస్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

వలిమెల: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రజా భరోసా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. క్రీడల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, మహారాష్ట్ర గచ్చిరోలి క్రీడాకారులతో పాటు, ములుగు, భూపాలపల్లి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం రంగాపూర్ జట్టు మొదటి విజేతగా నిలిచింది. మహదేవపూర్ మండలం అంబటిపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలువగా.. భూపాలపల్లి జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర గచ్చిరోలి జిల్లా గుమ్మలకొండ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది.

విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి సీతక్క పక్కన కలెక్టర్ దివాకర



కృషితో ఫలితం

గతేడాది కంటే 'పది'లో మెరుగైన ఫలితాలు

- రాష్ట్రంలో జిల్లాకు 8వ స్థానం
- అత్యధికంగా సైన్స్‌లో 39, గణితంలో 30మంది విద్యార్థులు ఫెయిల్

గతేడాది వివరాలు..

పరీక్ష రాసిన విద్యార్థులు	3,081
ఉత్తీర్ణత శాతం	95.65
రాష్ట్రంలో జిల్లాకు ర్యాంకు	13

ఈ ఏడాది వివరాలు ఇలా..

పరీక్ష రాసిన విద్యార్థులు	31,034
ఉత్తీర్ణత శాతం	97.64
రాష్ట్రంలో జిల్లాకు ర్యాంకు	8

ములుగు: మనం చేసే కృషితోనే ఏదైనా సాధించవచ్చు అనేది జిల్లా విద్యార్థులు నిరూపించారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రం స్థాయిలో జిల్లా 13వ స్థానంలో నిలవగా ఈ సారి 8వ స్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా 9మండలాల్లో 3,134 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3,060 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 97.64గా ఉత్తీర్ణత శాతం నమోదయింది.

సెప్టెంబర్ నుంచి ప్రత్యేక ప్రణాళిక

మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర చొరవతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టారు. రోజువారీగా లీజర్ క్లాసుల్లో సబ్జెక్టుల వారీగా రివిజన్ తీసుకొని విద్యార్థుల ప్రతిభను గుర్తించారు. పాఠశాల వారీగా విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా గుర్తించారు. సీ కేటగిరిలో 200మంది విద్యార్థులు ఉన్నట్లుగా గమనించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. మొదట వీరికి బిట్స్, చిన్న చిన్న ప్రశ్నలు వంటి వాటిపై పరీక్ష నిర్వహించి వారిలో ఉన్న చురుకుదనాన్ని గమనించారు. దీంతో పాటు మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ, తహసీల్దార్ ఎంఈఓలు నిత్యం పర్యవేక్షణ చేస్తూ వచ్చారు. విద్యార్థుల మనోగతాన్ని తీసుకొని వారి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రత్యేక శ్రద్ధ చూపారు.

సైన్స్, గణితంలో ఫెయిల్

సి కేటగిరిలోని 200 మందిని గుర్తించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 40 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా వారిలో కొంతమేర ప్రతిభను చూసిన ఉపాధ్యాయులు మరింతగా ప్రోత్సహించారు. అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా 74మంది ఫెయిలయ్యారు. ఇందులో ఎక్కువ శాతం సైన్స్‌లో 39 మంది, గణితంలో 30 మంది, తెలుగులో 10 మంది, సాంఘిక శాస్త్రంలో ఇద్దరు, ఇంగ్లిషులో ఒకరు ఫెయిలయ్యారు. ముఖ్యంగా గణితం సబ్జెక్టు పరీక్ష పేపర్ తప్పుగా వచ్చిందని విద్యార్థులు ఉపాధ్యాయులకు చెబుతున్నారు. ఫెయిల్ అయిన వారిని పాఠశాలకు రప్పించుకొని సప్లమెంటరీ పరీక్షల ద్వారా మరింత ఉత్తమ ఫలితాలు రాబట్టేలా విద్యాశాఖ తరఫున కసరత్తు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర అధ్యక్షతన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదిలో 97.63 శాతం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలో జిల్లా 6వ స్థానంలో నిలవడం హర్షించదగిన విషయమన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి జిల్లాలోని 10పాఠశాలలకు 100 కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో మంత్రి సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో డీఈఓ పాణిని, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 8వ స్థానంలో నిలవడం సంతోషకరం



రాష్ట్ర స్థాయిలో జిల్లా గతేడాది 95.65శాతం ఉత్తీర్ణతతో 13వ స్థానంలో నిలిచింది. ఈసారి 97.64శాతంతో 8వ స్థానంలో నిలవడం సంతోషకరం. ఫెయిల్ అయిన విద్యార్థులను ప్రోత్సహించి సప్లమెంటరీలో పాస్ అయ్యేలా ప్రణాళిక రూపొందించాం. ఈ విషయాన్ని ఎంఈఓలు, హెచ్ఎంలకు ఉపాధ్యాయులకు తెలియజేస్తాం.

\- పాణిని, డీఈఓ

ఘనంగా మేడే



ములుగులో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

ములుగు/ ములుగు రూరల్: జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా జెండాలను ఆవిష్కరించారు. కార్మికులు 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని చేసిన పోరాటంతో మే 1న కార్మికుల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు పలువురు నాయకులు వివరించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 8గంటల పని విధానానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. 44కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లకు కుదించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.



జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

కులగణనను కేంద్రం ఆమోదించడం సంతోషం

- డీసీసీ అధ్యక్షుడు అశోక్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు అశోక్

ములుగు: రాహుల్‌గాంధీ సూచనల మేరకు కేంద్రం ప్రభుత్వం కులగణనను దేశ వ్యాప్తంగా అమలు చేయడాన్ని ఆమోదించడం సంతోషకరమని డీసీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణను తొలిసారిగా అమలు చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఇది ముమ్మాటికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విజయమేనని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న, బీసీ సెల్ అధ్యక్షుడు రవియాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మావిడిశెట్టి కోటి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



రాఘవపట్నంలో ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క పక్కన కలెక్టర్

గోవిందరావుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల పరిధిలోని రాఘవ పట్నంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంత్రి సీతక్క కలెక్టర్ దివాకర, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మంజూరైన ఇళ్ల నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. రెండో దఫా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ప్రతీ దశలో ఉన్న ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో సీడీపీఓ శిరీష ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమే మనసుకు కాదని తెలిపారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, జిల్లా కార్మిక శాఖ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

వెంకటాపురం(కె)/వాజేడు: కేంద్ర, రాష్ట్రర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాటి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేత పేరుతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రిగుట్టల్లో హెలికాప్టర్లతో బాంబుల వర్షం కురిపిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఆపరేషన్ కర్రిగుట్టను నిలుపుదల చేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా వాజేడు మండల పరిధిలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం బోదెబోయిన సురేశ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉయిక శంకర్ మాట్లాడుతూ కర్రిగుట్టల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గుట్టల్లోని ఖనిజ సంపదను దోచుకోవడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల ఏరివేత పేరుతో కూంబింగ్ కొనసాగిస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో కట్టం నర్సింహరావు, చిక్కుడు రజనీకుమార్, ఉయిక జగన్, మడప పగిడయ్య, పీర్ల మల్లిఖార్జునరావు, శ్యామల వెంకటేశ్వర్లు, బొగ్గుల సమ్మయ్య, కణితి శేషు, సోడి సారయ్య, శ్యామల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జావెలిన్ త్రోలో ఇ.ప్రేమ్ కుమార్‌కు బంగారు పతకం



హన్మకొండ: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలో ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ పోటీల్లో భీమదేవరపల్లి ఈఆర్‌ఓలో ఏఏఓగా పనిచేస్తున్న ఇ.ప్రేమ్ కుమార్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. గురువారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రేమ్ కుమార్‌ను ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డీఈ (టెక్నికల్) విజేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు యాకూబ్ పాషా, సునీల్ కుమార్ అభినందించారు.

కేడీసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రజనీలత

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రజనీలత బాధ్యతలు నిర్వర్తించనున్నారు. బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వర్తించిన డాక్టర్ జి.రాజారెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న రజనీలతకు చార్జీని అప్పగించారు. అధికారికంగా కళాశాల విద్యాకమిషనర్ త్వరలోనే కేడీసీ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా రజనీలతను నియమించనున్నట్లు తెలిసింది.

అకాల వర్షం.. తీరని నష్టం

- కోతకొచ్చిన సుమారు 500 ఎకరాల్లో నేలవాలిన వరి
- కన్నీటిపర్యంతం అవుతున్న అన్నదాతలు
- ఆదుకోవాలని వేడుకోలు



ఈ ఫొటోలోని రైతు పేరు అలుగం సమ్మయ్య. చల్వాయి గ్రామం. గొరారం శివారులోని 5 ఎకరాల్లో 962 వరంగల్ వరి రకం పంట సాగు చేశాడు. బుధవారం రాత్రి 9గంటలకు వచ్చిన గాలివాన బీభత్సానికి పంట మొత్తం నేలవాలింది. దీంతో పంటసాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని పొలంలో కూర్చొని కన్నీటి పర్యంతం అయ్యాడు.



చల్వాయిలోని గొరారం శివారులో నేలవాలిన వరిపంట

ములుగు/గోవిందరావుపేట: అకాల వర్షాలతో అన్నదాతలు అష్టకష్టాల పాలవుతున్నారు. జిల్లాలో బుధవారం రాత్రి వచ్చిన గాలి దుమారం, కురిసిన అకాల వర్షానికి కోతకొచ్చిన వరి పంట నేలవాలింది. పలుచోట్ల ధాన్యం గింజలు రాలిపోయాయి. ధాన్యం రాశులు తడిసిపోవడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

కల్లాల్లో తడిసిన ధాన్యం

ములుగులో బుధవారం రాత్రి 8 గంటల నుంచి 9:30గంటల వరకు గాలివాన బీభత్సానికి ధాన్యం రాశులపై పరదాలు కొట్టుకపోయాయి. పలుచోట్ల టార్పాలిన్ కవర్లు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం ధాన్యం ఆరుతుందని కప్పిన పరదాలను తొలగించిన రైతులు చదును క్రమంలో మళ్లీ ఒక్కసారిగా కురిసిన వర్షంతో పూర్తిగా తడిసింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు నానా అవస్థలు పడుతూ కనిపించారు. స్పందించిన మంత్రి సీతక్క రైతులు అధైర్యపడకూడదని శుక్రవారం నుంచి హన్మకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మిల్లులకు ధాన్యం తరలిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ములుగు మండలంలో 26.4ఎంఎం, వెంకటాపురం(ఎం) మండలంలో22.8 ఎంఎం, ఎస్ఎస్ తాడ్వాయిలో 9.6 ఎంఎం, గోవిందరావుపేటలో 9.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అలాగే భారీ గాలి దుమారానికి ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో బుధవారం రాత్రి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం ఉదయం కొన్ని కాలనీలకు విద్యుత్ సరఫరా చేసిన అధికారులు 10గంటల తర్వాత మళ్లీ కోత విధించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. రాత్రి 7:50గంటలకు ములుగు పట్టణంలోని అన్ని కాలనీలకు విద్యుత్ సరఫరా చేశారు.

సుమారు 500ఎకరాల్లో నేలవాలిన వరి

గోవిందరావుపేట మండల పరిధిలోని చల్వాయి, గోవిందరావుపేట, పస్రా, దుంపెల్లిగూడెం, లక్ష్మీపురం, కర్లపల్లి, మొద్దులగూడెం గ్రామాల్లో 20రోజుల నుంచి 5, 6రోజులకొకసారి కురుస్తున్న అకాల వర్షాలకు వరిధాన్యం రాలిపోయి మొలకెత్తుతున్నాయి. దీంతో చేసేదేమీ లేక రైతన్నలు గుండెలు బాదుకుంటున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలు కొన్ని చోట్ల కోసినా అవి కాస్త కాంటాలు కాక వివిధ రకాల కారణాలతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులపై పట్టాలు కప్పి కాపాడుకుంటున్నారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మండల వ్యాప్తంగా సుమారుగా 500ఎకరాల్లో వరి పంట నేలవాలింది. అకాల వర్షాలు ఇలాగే కురిస్తే ధాన్యం రాలిపోయి మొలకలు వచ్చే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



మొలకెత్తుతున్న రాలిన ధాన్యం గింజలు

70శాతం ధాన్యం నేలరాలింది..



ఆరుగాలం కష్టపడి 6 ఎకరాల్లో వరి పంట పండించాను. 24గంటలు పంటను రక్షించుకున్నాను. అకాల వర్షాలు గాలిదుమారానికి రేపు కోయాల్సిన వరి ధాన్యం 70శాతం నేలరాలింది. దీంతో తీవ్రంగా పంట నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి. లేదంటే ఆత్మహత్యనే శరణ్యం.

\- కొన్నె అశోక్, రైతు, చల్వాయి

చేతికొచ్చిన పంట నష్టపోయాం..



ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంట అకాల వర్షానికి పంట దెబ్బతింది. మా గోస ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. కౌలుకు తీసుకుని పంట సాగు చేశాను. చేతికి అందివచ్చిన పంట నేలవాలిపోయింది. దాన్ని ఎలా కోయించాలో అర్థం కావడం లేదు.

\- సూరపనేని నాని, రైతు, చల్వాయి



ములుగులో తడిసిన ధాన్యం



జాతీయ రహదారిపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

క్లుప్తంగా

కాజీపేట నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు

- మే, జూన్‌లో నడిపించనున్న రైల్వే..



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ నుంచి తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రానికి ప్రయాణికులు, భక్తుల కోసం వేసవిని పురస్కరించుకొని ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు

కాజీపేట–తిరుపతి (07253) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24వ తేదీల్లో కాజీపేట నుంచి 13:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు 09:40 గంటలకు చేరుతుంది. అదేవిధంగా తిరుపతి–కాజీపేట (07254)వెళ్లే ఎక్స్‌ప్రెస్ మే 6, 13, 20, 27, జూన్ 4, 11, 18, 25వ తేదీల్లో ప్రతి బుధవారం తిరుపతిలో 12:30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు కాజీపేటకు 08:00 గంటలకు చేరుతుంది. ఈ సర్వీస్‌లకు జనగామ, భువనగిరి, చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, సేడెమ్, సులేహలి వెస్ట్, యాద్గిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గూటి, తాడిపత్రి, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ అవకాశం కల్పించారు.

కేయూలో యథావిధిగా హాస్టల్స్, మెస్‌లు

కేయూ క్యాంపస్: అలుమనాక్ ప్రకారం కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులకు మే 1 నుంచి అధికారులు సెలవులు ప్రకటించారు. అయితే పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థులు మాత్రం తమకు పోటీ పరీక్షలున్నాయని యథావిధిగా హాస్టళ్లు, మెస్‌లను కొనసాగించాలని ఇటీవల ఆందోళన చేశారు. దీంతో హాస్టల్స్, మెస్‌లను యథావిధిగా కొనసాగిస్తున్నారు. గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులతో అకాడమిక్ కమిటీహాల్‌లో సమావేశం నిర్వహించారు. పీజీ కోర్సుల ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం హాస్టళ్లు, మెస్‌లను కొనసాగిస్తున్నందున వారికి నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెలలో నిర్వహించాలనే అంశం చర్చకు వచ్చిందని సమాచారం. కానీ, జూన్ 6వ తేదీ నుంచి పీజీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు టైంటేబుల్ ప్రకటించారు. ఈనెల 2న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి వచ్చాక సమావేశం నిర్వహించి తుదినిర్ణయం తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. సెలవులు ఇచ్చినప్పటికీ హాస్టల్, మెస్ సదుపాయం కల్పించాలని సుమారు 149మంది పీజీ కోర్సుల ఫస్టియర్ విద్యార్థులు సంబంధిత అధికారులను కోరారు. వారికి కూడా అవకాశం ఇచ్చినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, లా కళాశాల విద్యార్థుల హాస్టళ్ల మెస్‌లను మూసివేసినట్లు డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా బీఈ డీ, ఎంఈడీ కోర్సుల విద్యార్థులకు హాస్టళ్లలో, మెస్ సదుపాయం యథావిధిగా కొనసాగనుంది.



సమ్మక్కసాగర్ @ డెడ్ స్టోరేజ్

జలాశయానికి తగ్గుతున్న ఇన్‌ఫ్లో
- బ్యారేజీలో తేలిన ఇసుక మేటలు
- ముమ్ముందు తప్పని నీటి కష్టాలు
- ఇన్‌టెక్ వెల్ నుంచి ఒక మోటారు ద్వారా పంపింగ్



నీరులేకపోవడంతో ఇసుక మేటలతో ఉన్న సమ్మక్క బ్యారేజీ ప్రాంతం

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. దేవాదుల ఇన్‌టెక్ వెల్ పంపింగ్‌కు జీవనాధారంగా పిలువబడే జలాశయం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండడంతో పంపింగ్‌కు అంతరాయం ఏర్పతుందనే చర్చ సాగుతుంది. పంపింగ్ నిలిచిపోతే దేవాదులకు దిగువన ఉన్న భీమ్‌ఘనపూర్, గొల్లబుద్ధారం వంటి రిజర్వాయర్లకు నీటి కష్టాలు తప్పవనే సంకేతాలు వస్తున్నాయి. ప్రస్తుతం సాగు నీటి అవసరం తగ్గినా.. తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు ముందుచూపుతో బ్యారేజీలో నీటిని నిల్వ ఉంచకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తగ్గిన నీటి నిల్వలు..

సమ్మక్క సాగర్ బ్యారేజీ జలాశయంలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గి డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.76 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. బ్యారేజీ పూర్తి నీటి మట్టం 83 మీటర్లు కాగా ప్రస్తుతం 72.30మీటర్లు ఉన్నాయి. బ్యారేజీలోకి ఎగువ నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుంది. బ్యారేజీలోని 59 గేట్లలో 58 గేట్లను క్లోజ్ చేసి ఒక గేటు నుంచి 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గత కొంత కాలంగా పూర్తి గేట్లను మూసి నిల్వ చేసిన నీటిని దిగువ ప్రాంతాల తాగు నీటి అవసరాల నిమిత్తం వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలుపుతున్నారు.

దిగువ ప్రాంతాలకు తప్పని తిప్పలు..

దేవాదుల ఇన్‌టెక్ వెల్‌కు దిగువన ఉన్న గొల్లబుద్ధారం, భీమ్ ఘనపూర్, మొదలగు జలాశయాలకు నీటి ఇబ్బందులు తప్పేలా లేవు. దేవాదుల పంపింగ్ నిలిచిపోతే దిగువన ఉన్న జలాశయాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అదే జరిగితే ఆ జలాశయాల నీటిపై తాగు నీటికి ఆధారపడే ప్రాంతాలకు నీటి అవసరాలు తీర్చడానికి అధికారుల వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు కనబడడం లేదు.

నిలిచిపోనున్న దేవాదుల పంపింగ్..

తుపాకులగూడెం గ్రామ పంచాయతీలోని గుట్టలగంగారం గ్రామ పరిధిలోని దేవాదుల ఎత్తిపోతల పంపింగ్ కొద్ది రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే పరిస్థితికి నెలకొంది. ఇన్‌ఫ్లో లేకపోవడంతో గోదావరిలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. దేవాదుల వద్ద 71.00మీటర్ల నీటి మట్టం వరకు పంపింగ్ చేసే అవకాశం ఉండగా.. ప్రస్తుతం 71.75 మీటర్లు మాత్రమే ఉన్నాయి. దేవాదుల వద్ద మూడు ఫేజ్‌లలో పది మోటార్లు ఉండగా.. ఏప్రిల్‌లో 5,6 మోటార్ల ద్వారా పంపింగ్ చేసిన అధికారులు నీటి నిల్వలు తగ్గడంతో ఒక మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. వీటితోపాటు సమ్మక్క బ్యారేజీలోని ఒక గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అంటే రోజులో 547 క్యూసెక్కుల నీరు గోదావరిలో తగ్గిపోతుంది. కానీ, ఎగువ నుంచి బ్యారేజీలోకి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుంది.

ఎగువ నుంచి నీరు రావడం లేదు



గోదావరిలోకి ఎగువ నుంచి నీరు రాకపోవడంతో బ్యారేజీలో నీరు తగ్గిపోతుంది. దేవాదుల వద్ద పంపింగ్‌కు సరిపడా నీరు అందకపోవడంతో ప్రస్తుతం ఫేజ్ 2లో ఒక మోటారు ద్వారా మాత్రమే పంపింగ్ చేస్తున్నాం. గోదావరిలోకి నీరు చేరితే మరో కొన్ని మోటార్లు ఆన్ చేసి పంపింగ్ చేస్తాం. బ్యారేజీ దిగువన గోదావరికి ఉన్న మిషన్ భగీరథ పంపింగ్ కొనసాగించడం కోసం బ్యారేజీలో ఒక గేటును ఎత్తి నీటిని వదులుతున్నాం.

– శరత్ బాబు, దేవాదుల డీఈఈ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- దేశవ్యాప్త కులగణన ఆలోచనకు రాష్ట్రమే దిక్సూచి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం: అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు అందజేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి స్వగ్రామమైన మండలంలోని ధన్వాడలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బొడిగె భాగ్య, చేకూర్తి పావని, ఆత్కూరి దుర్గ, తాటి పల్లవి ఇంటి నిర్మాణానికి కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా స్థలాలు కలిగిఉన్న అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మంథని నియోజకవర్గం కాటారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు మొదటి విడతలో భాగంగా 1,773 ఇళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో పదేళ్లలో పేదల సొంతింటి కల నెరవేరలేదని అన్నారు. మొదటి దశలో స్థలం ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విడతల వారీగా ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణాలను సబ్ కలెక్టర్ నిత్యం పర్యవేక్షించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నిర్మాణ ప్రగతి ఫొటోలను సంబంధిత అధికారులు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టే ఆలోచనకు రాష్ట్రం దిక్సూచి అయిందన్నారు. అనంతరం విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పలువురు చిన్నారులను పలకరించి ఏ పాఠశాలలో చదువుతున్నారు.. ఏ తరగతి చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులను హైదరాబాద్, ఢిల్లీ స్థాయిలో పంపిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణశాఖ పీడీ లోకిలాల్, డీఆర్‌డీఓ నరేశ్, డీపీఓ వీరభద్రయ్య, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సమ్మయ్య, మహేశ్ పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందులుంటే ఫోన్ చేయండి

- టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

హన్మకొండ: ధాన్యం కొనుగోళ్లు, కొనుగోళు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులున్నా, సమస్యలు, సలహాలు, సూచనల కోసం రైతులు టోల్ ఫ్రీ నంబర్ 180 0 4250 0333కు ఫోన్ చేయాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో రైతులను కోరారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అదనపు తాలు, తూకం పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, రాత్రి వేళ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

రూ.లక్ష ఇస్తే ఉద్యోగం నీకే..!

- వాట్సాప్ కాల్‌లో బేరసారాలు
- డీఎంహెచ్ కార్యాలయ ఉద్యోగిగా పరిచయం



ఫిర్యాదు చేసిన ప్రేమ్ కుమార్

జనగామ: హలో.. వైద్యారోగ్య శాఖ లో ఉద్యోగం కావాలా..? రూ.లక్ష పట్టుకురా.. బాధ్యత నాది అంటూ ఓ వ్యక్తి.. డీఎంహెచ్ఓ కార్యాలయం అధికారిగా చెబుతూ ఓ నిరుద్యోగికి వాట్సాప్ కాల్ చేసి బేరసారాలు సాగించిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు చిల్పూరు మండలం కృష్ణాజీగూడేనికి చెందిన మారపాక ప్రేమ్‌కుమార్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎస్) పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈక్రమంలో గత నెల 26, 27వ తేదీల్లో ఓ వ్యక్తి నుంచి రెండుసార్లు వాట్సాప్ కాల్ రాగా.. ప్రేమ్‌కుమార్ లిఫ్ట్ చేయలేకపోయాడు. మరోసారి కాల్ రాగా.. లిఫ్ట్ చేయడంతోనే ఎస్‌టీఎస్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు కదా.. అంటూ ప్రేమ్ కుమార్ వివరాలను పూర్తిగా చెప్పాడు. ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ముట్టజెబితే ఆ పోస్టు నీకే వస్తుందని నమ్మబలకడంతో అంత స్థోమత తనకు లేదని నిరాకరించారు. చివరగా వచ్చిన మెరిట్ లిస్టులో తన పేరు 6వ స్థానంలో ఉండగా, జాబితాలో అవకాశం రాకపోవడంతో నిరాశకు లోనయ్యాడు. ఉద్యోగ నియామక ప్రక్రియలో 1 నుంచి 11 స్థానాల వరకు అర్హత కలిగిన నిరుద్యోగులు ఉన్నప్పటికీ, ఆ పైన ఉన్న నంబర్ వ్యక్తిని సెలెక్టు చేయడంపై బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. కొంతమంది వ్యక్తులు అడ్డదారిలో సెలక్ట్ చేస్తున్నారని, దాంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని, దీనిపై కలెక్టర్ విచారణ చేయించాలని ప్రేమ్ కుమార్ డిమాండ్ చేస్తున్నాడు. ఫోన్‌లో డబ్బుల డిమాండ్, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తనకు అనుమానం ఉందని పేర్కొంటూ ప్రేమ్‌కుమార్ కలెక్టరేట్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగ మెరిట్ జాబితాపై అభ్యంతరాలను తెలిపేందుకు ఈ నెల 1వ తేదీ(గురువారం) వరకు అవకాశం ఇచ్చామని, ప్రస్తుతం ఫిర్యాదు చేసిన వ్యక్తి అభ్యంతరం తెలుపుతూ ఎలాంటి దరఖాస్తు ఇవ్వలేదని తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు అర్హత ఉంటే ఉద్యోగం వస్తుందని, తమ కార్యాలయం నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే విచారణ జరిపిస్తామన్నారు. ఎవరి ఫోన్, ఎక్కడ నుంచి వచ్చిందనే దానిపై సైతం ఆరా తీస్తామని తెలిపారు.

కోర్టు ఆదేశాలు బేఖాతర్

- పట్టించుకోని టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం
- సీజేఎల్ఎంలకు దక్కని ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ : సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులు ఇచ్చినా టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విద్యుత్ కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 7,114 ఉద్యోగాల భర్తీకి 2006, జూన్ 8న ఒకసారి.. 2006 అక్టోబర్ 20న మరోసారి నోటిఫికేషన్ విడుదలైంది. పలువురు అర్హత పరీక్షకు హాజరై ఉద్యోగానికి అర్హత సాధించారు. ఏడాదిపాటు ప్రొబేషనరీ పీరియడ్‌తో మొదటి సారి 2007లో దాదాపు 1,564 మందిని కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్లుగా, కోర్టుకు వెళ్లిన తర్వాత 2011లో దాదాపు 875 మందిని నియమించారు. నియామక ప్రక్రియలో కేవలం వయస్సును మాత్రమే ప్రామాణికంగా తీసుకుని భర్తీ చేపట్టడంతో అప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిలో సబ్ స్టేషన్ ఆపరేటర్లుగా, ఇతర ఉద్యోగాలు చాలా రోజులుగా చేస్తున్న వారు నష్టపోయారు. దీంతో నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా మెరిట్‌ను పరిగణలోకి తీసుకోలేదని, నోటిఫికేషన్ ముందు కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఎక్కువ పనిదినాలు నిర్వహించి, ఇంటర్వ్యూలో అర్హత సాధించిన తమను ఉద్యోగానికి ఎంపిక చేయలేదని అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. ద్విసభ్య ధర్మాసనం 2009 నవంబర్ 10న అర్హత కలిగి ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు క్లాజ్–6 (4)(సీ) ప్రకారం 2007, 2011లో ఉద్యోగం పొందిన అభ్యర్థులకు సర్వీస్ బెనిఫిట్స్ కల్పించాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాన్ని ఆదేశించింది. కోర్టు తీర్పు మేరకు 2011 ఆగస్టు 2న ఉద్యోగాలు ఇచ్చిన వీరికి సర్వీస్ బెనిఫిట్స్ మాత్రం కల్పించలేదు. దీంతో కోర్టు ఇచ్చిన తీర్పును పూర్తిగా అమలు చేయలేదని ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తులు అభ్యర్థులకు సర్వీస్ బెనిఫిట్స్ వర్తింపజేయాలని తీర్పు ఇచ్చారు. అప్పటి ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కార్తికేయ మిశ్రా నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు సీనియారిటీ జాబితా తయారు చేయాలని మెమో జారీ చేశారు. 2007, 2011లో నియామకమైన అభ్యర్థులందరితో సీనియారిటీ జాబితాను రూపొందించారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసినప్పుడు తక్కువ పనిదినాలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయగా వారు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు 2019 ఫిబ్రవరి 25న తీర్పు ఇస్తూ 2009లో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆదేశించగా, అభ్యర్థులు ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి వినతి పత్రం అందించారు. నాటి నుంచి నేటి వరకు సీఎండీలు మారుతున్న తమకు మాత్రం న్యాయం జరుగడం లేదని 2011లో ఉద్యోగాలు పొందిన సీజేఎల్ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు 2011 నుంచి జీతం ఇవ్వాల్సి ఉండగా 2016 నుంచి మాత్రమే జీతం చెల్లిస్తున్నారని తెలిపారు. ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మ్యాన్ డేస్‌ను కాకుండా పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవవడంతో మ్యాన్‌డేస్ (పని దినాలు) ఎక్కువగా ఉన్న వారు సీనియారిటీని కోల్పోతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ఉచిత కంప్యూటర్ శిక్షణ

■ ఉచిత కంప్యూటర్ శిక్షణ (Tally, PGDCA) విద్యార్థి కంప్యూటర్స్, డాల్ఫిన్ హోటల్ గల్లి, వరంగల్ చౌరస్తా, వరంగల్. T&C Apply. [WA-6594]

SERVICES

■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి చేయబడును. సెల్: 7842279342 హన్మకొండ. [WA-7561]

సిరి అసోసియేట్స్

■ హౌస్, మార్టిగేజ్, పర్సనల్, ఓపెన్ ప్లాట్స్, రేకుల, గూనపెంకుల ఇళ్లపై సిబిల్ లేకున్నా రుణాలు ఇప్పించబడును. సెల్: 9666142226. [SCA25003122]

CHANGE OF NAME

■ I, THANDRA YADAMMA, W/o. PALEPOGU ASHIRWADHAM (Old Name), R/o. H.No. 25-10-5/B, Ambedkar Nagar, Bapuji Nagar, Kazipet, Kazipet mandal, Hanumakonda dist have changed my name as THANDRA ADHEMMA, W/o. THANDRA NARASIMHA (New Name). For all future purposes. [SCA25003118]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

■ ప్రైవేట్ మినీ బ్యాంక్ & ప్రైవేట్ సంస్థలో పని చేయుటకు అనుభవం కల్గిన సెక్యూరిటీ గార్డ్స్ & హౌస్ కీపింగ్ (F) కావలెను. ఫోన్: 0870–3569177, 8019484141. [WA-6593]

■ పెట్రోల్‌పంపు & రైల్వేలో సివిల్ కన్‌స్ట్రక్షన్ నందు పని చేయుటకు ఇంజనీర్స్, సూపర్‌వైజర్స్, డ్రైవర్స్ కావలెను. 9989606333, 9491474143. [SCA25003124]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25–30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 9550467459 [SCA25003066]

■ Delicious Chicken Outlets are looking for a Sales Executives in Warangal Location. Exp 1-2 Yrs. Sal: 15K + Petrol. Cell: 8106112401. [SCA25003016]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భద్రకాళి దేవాలయంలో ఎదుర్కోలు ఉత్సవం

- మకర, చంద్రప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు
- నేడు భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవం



మకరవాహనంపై అమ్మవారు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడోరోజు భద్రకాళిభద్రేశ్వరుల ఎదుర్కోలు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి నిత్యాహ్నికం, చతుస్థానార్చన నిర్వహించి.. అమ్మవారిని పూలమాలలతో అలంకరించారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని మకరవాహనంపై ఊరేగించారు. సేవాకార్యక్రమాలకు వరంగల్ ఆర్యవైశ్య సంఘం దాతలుగా వ్యవహరించారు. మహిళలు కుంకుమపూజలు, లలితాసహస్రనామ పారాయణం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్‌రావు, ప్రోగ్రాం కన్వీనర్ తొనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, అయితా గోపీనాథ్, అల్లాడి వీరభద్రయ్య, గుండా హైమావతి, శ్రీరాం శైలజ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 7గంటలకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవంలో భక్తులు ఆసక్తిగా పాల్గొన్నారు. అమ్మవారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. సంస్కృత పండితులు దోర్బల ప్రభాకరశర్మ, గోరుగస్తు భాస్కర వెంకటసుబ్రహ్మణ్యశర్మ శివకల్యాణ రాయభారం ఘట్టాన్ని వివరించారు.నేడు(శుక్రవారం) సాయంత్రం నిర్వహించే భద్రకాళిభద్రేశ్వరుల కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనాలని, పాల్గొనే వారు రూ.516 చెల్లించాలని తెలిపారు. వారికి కల్యాణోత్సవ తలంబ్రాలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేయనున్నట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

భద్రకాళి కల్యాణబ్రహ్మోత్సవాల పూజాకార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే పాల్గొన్నారు. వారి వెంట కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు పూడికతీత, మాడవీధులు, దేవాలయం నుంచి కాపువాడ వరకు గల భద్రకాళి చెరువు కట్టను బలోపేతం చేస్తూ చుట్టూ గుట్టలను, చెరువు, పచ్చదనం సంతరించుకునేలా ఆలయప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కుడా అధికారులను కోరారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకరి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహం

నెల్లికుదురు: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని సంధ్య తండా పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సిరోలు మండలం కాంపల్లి గ్రామానికి చెందిన పులసాని విష్ణువర్ధన్‌రెడ్డి (40) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబంతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో నెల్లికుదురు మండలం కాస్యతండాకు చెందిన బానోతు లక్ష్మణ్ వరి గడ్డిని ట్రాక్టర్‌లో వెడల్పుగా లోడు చేసుకుని నెల్లికుదురు వైపునకు అజాగ్రత్తగా నడుపుతూ రాంగ్ రూట్లో వచ్చి మండలంలోని సంధ్య తండా పరిధిలోని నెల్లికుదురు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై విష్ణువర్ధన్ రెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో విష్ణువర్ధన్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి తల్లి పులసాని రజిత ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని మరొకరు..



పరశురాములు(ఫైల్)

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్‌బాబు గురువారం తెలిపిన వివరాల ప్రకారం .. మునిగలవీడు గ్రామానికి చెందిన ఉప్పరబోయిన పరశురాములు (59) ఏప్రిల్ 25న తన టీవీఎస్ ఎక్సల్ మోటార్ సైకిల్‌పై మహబూబాబాద్ వైపునకు వెళ్లుండగా.. మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన మందుల వెంకన్న తన బైక్‌పై నెల్లికుదురు వైపు నుంచి శ్రీరామగిరి గ్రామానికి వెళ్తూ రాంగ్ రూట్లో పరశురాములు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రికి తరలించారు. పరశురాములు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో అక్కడ చికిత్స పొందుతూ పరశురాములు మృతి చెందాడని మృతుడి బాబాయి ఈర వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మామిడికాయలు కోస్తుండగా విద్యుత్ షాక్..

- కుడా జూనియర్ అసిస్టెంట్ మృతి
- దేశాయిపల్లిలో విషాదఛాయలు



అంకేశ్వరపు చంద్రమౌళి(ఫైల్)

దుగ్గొండి: పచ్చడి మామిడి కాయలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని దేశాయిపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన అంకేశ్వరపు చంద్రమౌళి(40) గతంలో వీఆర్‌ఓగా పనిచేశాడు. ప్రస్తుతం కుడా పరిధిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 29న తన బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా స్వగ్రామం దేశాయిపల్లికి వచ్చాడు. తిరిగి విధులు నిర్వర్తించే ప్రాంతానికి వెళ్లేముందు ఓ కర్రకు చివరన ఇనుప కొడవలి కట్టి తమ ఇంటి ఆవరణలోని మామిడి కాయలు కోస్తున్నాడు. ఈక్రమంలో చెట్టుపై నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు కొడవలి తగిలింది. కర్ర పచ్చిగా ఉండడంతో విద్యుత్‌షాక్ తగిలి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. చంద్రమౌళికి భార్య దేవేంద్ర, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి అంకేశ్వరపు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

బరిసె మెడపై కోసుకుపోయి వ్యక్తి మృతి

ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ..
- ఓ వాహనంపై ఉన్న బరిసె మరో వాహనంపై ఉన్న వ్యక్తి గొంతుకు కోసుకుపోవడంతో ఘటన..
- మృతదేహంతో బంధువుల ఆందోళన

దంతాలపల్లి: ప్రమాదవశాత్తు పామాయిల్ చెట్లను చెక్కే బరిసె గొంతుకు కోసుకుపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. అప్పటివరకు తనతో కలిసి మాట్లాడుతూ వచ్చిన భర్త కళ్లెదుటే మృతి చెందడంతో ఆ ఇల్లాలు దిక్కుతోచని స్థితిలో అల్లాడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనకుంట తండా గ్రామానికి చెందిన బానోత్ రమేశ్ (40)తన భార్య సునీతతో కలిసి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం వచ్చారు. ఆ గ్రామానికి చెందిన పెల్లి దామోదర్ రెడ్డి తన పామాయిల్ తోటలో పనిచేయడానికి బరిసెను పదును పెట్టించుకుని ద్విచక్రవాహనంపైన పెట్టుకుని ఇంటికి తీసుకెళ్తున్నాడు. గ్రామసమీపంలో రెండు వాహనాలు ఎదురుపడ్డాయి. ఎదురుగా వస్తున్న రమేశ్(40) గొంతుకు బరిసె కోసుకుపోవడంతో బైక్ పై నుంచి పడిపోయాడు. తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. వారు చేరుకుని రమేశ్‌ను పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు దీప్తి, దీపిక ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన

రమేశ్ మృతి విషయం తెలుసుకున్న తండావాసులు మృతదేహాన్ని దామోదర్ రెడ్డి ఇంటిఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. తొర్రూరు సీఐ గణేష్, దంతాలపల్లి ఎస్సై రాజు, నర్సింహులపేట ఎస్సై సురేష్ ఘటనస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.



రమేశ్ గొంతు కోసుకుపోయింది ఈ బరిసెతోనే..



రమేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు